



# రెండు గాడు

— మల్లాది వెంకట కృష్ణమూర్తి

విశాఖపట్నంలోని ఓ త్రీ స్టార్ హోటల్ బార్‌లో కూర్చుని ఉన్న నేను అప్పుడే లోపలికి వచ్చిన ఓ వ్యక్తికి యధాలాపంగా చూశాను. అతన్నెక్కడో చూసినట్లుగా అనిపించింది. నా పక్క స్టూల్ మీద కూర్చుని ఉన్న అతన్ని బీర్ తాగుతూ కాసేపు గమనించాక నాకర్థమైంది. అతను సెవెన్త్‌లో నా క్లాస్ మేటైన దత్తు అని.

"హలో ! మీరు దత్తు కదూ ?" అడిగాను.

"అవును —మీరు ?"

"నేనా ఆశప్పని."

"సారీ ! గుర్తుకు రావడం లేదు!"

"సెవెన్త్‌లో మనిద్దరం కలిసి సూళ్ళూరుపేటలో చదువుకున్నాం. మన సైన్స్ టీచర్ నిన్ను ఉంగరం మొట్టికాయలు వేస్తుండే వాడు..."

దత్తు ముఖంలో చిన్న చిరునవ్వు తళుక్కుమంది.

"నువ్వ్రా ఆశప్పా ? ఎలా ఉన్నావ్ ? ఏం చేస్తున్నావు ?" అడిగాడు దత్తు.

"ఇన్ఫోటెక్‌లో చేస్తున్నాను! నువ్వు?"

"నేను కాంట్రాక్ట్స్ చేస్తున్నాను. భలే గుర్తుపట్టావే నన్ను ? నిన్నసలు నేను గుర్తు పట్టనే లేదు. తెలుసా ?"

"ఎందుకు గుర్తు పట్టలేను?" నిన్నంతా టూ గాడు అనేవాళ్ళం కదా ?"

క్షణ కాలం దత్తు ముఖంలో చిరునవ్వు, స్వల్పంగా బాధ —రెండూ ఒకేసారి మేళవించి కనిపించాయి.

"అవును —నెంబర్ టూ."

"నిన్నంతా టూ గాడు అని ఎందుకనే వారు ?" అడిగాను దత్తును.

చిన్నగా నిట్టూర్చాడు దత్తు.

"అప్పటికే నా జీవితానికి, రెండంకెకి గట్టి సంబంధం ఉందని చాలా మంది స్టూడెంట్స్‌కి తెలియడంతో."

"అప్పటికే అంటే ఇంకా ఇప్పుడు కూడానా ?" అడిగాను.

"అవును. ఇప్పటికీ రెండంకె నన్ను వెంటాడుతూనే ఉంది" బాధగా చెప్పాడు దత్తు.

"ఎలాగెలా ?" ఆసక్తిగా అడిగాడు.

"నా జీవితం కవల సోదరుడిగా మొదలైంది."

"అవునవును. అది గుర్తుంది."

"నా రెండో ఏటే మా నాన్న, అమ్మ ఇద్దరూ పుష్కరాల్లో గోదార్లో కొట్టుకుపోయారు."

"అదీ గుర్తుంది."

"రెండో క్లాస్‌ని రెండుసార్లు చదివాను."

"ఇది కూడా తెలుసు."

"కాలేజీలో రెండో ఏడు నన్ను కాపీ కొడుతున్నందుకు డిబార్ చేశారు."

"ఇది నాకు తెలియదు."

"లక్ష్మిని ప్రేమించడానికి కేవలం రెండు రోజులే తీసుకుంది. రెండు వారాల తర్వాత లక్ష్మికి, నాకూ పెళ్ళయింది."

"ఈ విషయంలో మంచి జరిగిందన్న మాట."

"అప్పటికే లక్ష్మికి రెండో నెల."

"ఓ ! సో సారీ !"

"నా ఇరవై రెండో ఏడు కదా ! ముందూ, వెనుక చూడకుండా పెళ్ళి ముగ్గులోకి దూకి ఇరుక్కుపోయాను."

"పెళ్ళయిన రెండు నెలలకి విడాకులు తీసుకున్నావు కదా ?"

"అవును. నా కొడుకు అని క్లెయిమ్ చేసి. మా ఆవిడ వాడి రెండో ఏట నుంచి మెయిన్‌టెనెన్స్ తీసుకుంటోంది. కోర్టులో కేసు గెలిచి."

"టూ బేడ్."

"నా రెండో భార్యకి నేను రెండో భర్తనని, ఆమె కూడా విడాకులు తీసుకున్నదని తర్వాత కానీ తెలీలేదు."

"రెండో రాత్రి తెలిసిందా ?"

"నీ కెలా తెలుసు ?"

"ఊహించాను."

"అవును."

"ఆమె చెప్పకుండా ఉంటే బావుండేది" సానుభూతిగా చెప్పాను.

"ఏందుకు చెపుతుంది ? నార్త్ ఇండియన్‌తో ఎక్కడో లక్నోలో జరిగిన పెళ్ళి పెటాకులు నా కెలా తెలుస్తాయనుకుంది."

"మరెలా తెలిసింది నీకు?"

"రెండో రాత్రి ఆమె పొత్తికడుపు మీద, నడుం దగ్గర, ఆ రెండుచోట్లా ఉన్న మచ్చలని చూసి ఏమిటవని అడిగితే రెండో బిడ్డ పుట్టినప్పుడు ఏర్పడిన మచ్చలని చెప్పింది."

"దాంతో నువ్వు రెండో మొగుడన్న కథ బయటపడిందన్న మాట."

"అవును."

"సంపాదన మాటేంట్రా ? ఏం చేస్తున్నావు ?" దత్తు మొహంలోని బాధని గమనించి టాపిక్ మార్చాలని అడిగాను.

"ఫిబ్రవరి రెండు తొంబై రెండులో స్వంత వ్యాపారం మొదలెట్టాను. ఓ ప్రముఖ కంపెనీబ్రాలకి డీలర్ షిప్ తీసుకున్నాను. రెండేళ్ళల్లో నా లాభాలు ద్విగుణీకృతం అయ్యాయి.

"థాంక్ గాడ్. రెండు నీకు అప్పటి నుంచి అచ్చొచ్చిందన్న మాట."

"విను. ఆ తర్వాత ప్రతి ఏటా లాభాలు రెట్టింపవుతూ వచ్చాయి. ఇరవై లక్షల రూపాయలు పెట్టి జూబిలీ హిల్స్‌లో రోడ్ నెంబర్ టూలో రెండు వేల చదరపు గజాల స్థలంలో రెండు వేల అడుగుల ఇంటిని కట్టించాను."

"గుడ్ వెరీగుడ్."

"సెకండ్ సెటప్ కూడా. ఆ అమ్మాయి అచ్చం నా మొదటి భార్య లక్ష్మిలా ఉండడంతో సెకండ్ సెటప్ అన్న మాట."

"నువ్వు లక్ష్మిని బాగా ప్రేమించావన్న మాట. ఇప్పుడు నీకు ఇద్దరు పిల్లలా?"

"అవును."

"సెకండ్ సెటప్‌తో ?"

"అక్కడొకటి, ఇక్కడొకటి మొత్తం ఇద్దరు."

"నీ పని హాయిగా ఉందన్నమాట ఇప్పుడు."

"అసలైన రెండు విషయాలని ఆఖరున చెప్తాను. రెండేళ్ళల్లో రెండు ఖండాలను సెకండ్ సెటప్‌తో విజిట్ చేశాను."

చిన్నగా ఈల వేశాను.

"నువ్వు రెండంకెని రోజూ పూజించాలి."

"ఏ రెండులో ? ఇన్ కంటాక్స్ ఫారం సబ్‌మిట్ చేయాలన్న రూల్ పెట్టాడు ఆర్థిక మంత్రి చిదంబరం. సొంతిల్లు, ఫోన్ లేదా విదేశీ పర్యటన. విదేశీ పర్యటన లేదా సొంతిల్లు ఇలా... నా సెకండ్ సెటప్‌కి ఫోన్, విదేశీ పర్యటన వల్ల ఇన్‌కంటాక్స్‌లోని 'సెర్చ్ అండ్ సీజర్ పార్టీ 2' వర్చల ఇంటి మీద దాడి చేసింది."

"సెకండ్ సెటప్ పేరు వర్చలా ?"

"అవును. తనకి ఆదాయంలేదని, అన్నీ నేను కొనిచ్చానని వర్చల చెప్పడంతో నా మీదకి వచ్చారు. నేను మెయిన్‌టెయిన్ చేసే రెండు సెట్స్ అకౌంట్స్ బుక్స్ వాళ్ళకి ఆ దాడిలో దొరికాయి."

"అరెరె!"

"నేను రెండు రకాల వ్యాపారాలు చేస్తున్నా —ఒకటి నా ఇన్‌కంటాక్స్ రిటర్న్‌లో దాఖలు చేయకపోవడం కూడా గుర్తించారు."

"టూ బేడ్."

"దాంతో నేను ఇన్‌కంటాక్స్‌గా ప్రభుత్వానికి ఇరవై రెండు లక్షల రూపాయలు కట్టాలని తేల్చారు."

"అంతే !"

"పెనాల్టీ, వడ్డీ కలపకుండా."

"అయ్యో బాబోయ్ ! ఆ కేసు ఎప్పుడు తేలింది ?"

"సరిగ్గా రెండేళ్ళకి తేలింది. నా రెండిళ్ళూ ఇన్‌కంటాక్స్ వాళ్ళు వేలం వేశారు."

"ఛ... నువ్వెంత దురదృష్టవంతుడివి."

"ఆ సొమ్ము చాలక పోవడంతో రెండేళ్ళ జైలు శిక్ష కూడా వేశారు" నేను నోరు తెరుచుకుని చూస్తూండిపోయాను.

రెండు రోజుల క్రితమే విడుదలయ్యాను.

"తాగడం మొదలెట్టి ఇవాల్టికి రెండో రోజు."

"వద్దు. ఆరోగ్యం చెడుతుంది."

"ఆల్ రెడీ చెడింది."

"ఏమైంది ?"

"జైల్లో సరైన వైద్యం జరక్క హైపర్‌టెన్షన్, డయాబెటిస్ అనే రెండు రోగాల వల్ల రెండు కిడ్నీలు ఫెయిలయ్యాయి."

"టూ బేడ్... టూ బేడ్... వెరీసారి.... అలాంటప్పుడు నువ్వసలు ఆల్కహాలే ముట్టకూడదు కదా ?" అడిగాను.

"విను. ఆ తర్వాత ప్రతి ఏటా లాభాలు రెట్టింపవుతూ వచ్చాయి. ఇరవై లక్షల రూపాయలు పెట్టి జూబిలీ హి ల్స్‌లో రోడ్ నెంబర్ టూలో రెండు వేల చదరపు గజాల స్థలంలో రెండు వేల అడుగుల ఇంటిని కట్టించాను."




"ఇంకెన్నాళ్ళు ?"

ఆ నవ్వులో దిగులుందో లేదా ఫిలాసఫీ ఉందో నా కర్థం కాలేదు.

నాతో సరిగ్గా రెండు గంటలు గడిపి బయటికి వెళ్ళిపోయడు దత్తు.

రెండు వారాల తర్వాత పేపర్లో చదివాను. దత్తు కిడ్నీలు ఫెయిలై మరణించాడని. ఆ రోజు డేట్ చూశాను. రెండక్షరాల పేరు గల దత్తు ఫిబ్రవరి రెండున మరణించడం నాకు ఆశ్చర్యం కలిగించలేదు.

●